సాక్షి
జగిత్యాల

I

బుధవారం : 8 : నవంబర్ : 2023



అంజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయం మంగళవారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. సుమారు 15వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, అధికారులు లక్ష్మి రాజం, సంపత్ పర్యవేక్షించారు.



ఆగమైతే పాతరోజులే



మంథనిలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

- రూ.1,000కోట్లతో మంథనిని అభివృద్ధి చేస్తా
- అధికారంలోకి వచ్చాక కొత్త మండలాల ఏర్పాటు
- రాయి ఏందో.. రత్నం ఏందో గుర్తుపట్టాలి
- మంథని, పెద్దపల్లి సభల్లో సీఎం కేసీఆర్

సాక్షి,పెద్దపల్లి/పెద్దపల్లిరూరల్/మంథని: 'ఎన్నికల్లోస్తే ఎవరికిపడితే వాళ్లకు ఓటేయెద్దు.. ఆగం కావద్దు.. ధరణి తీసేస్తే మళ్లీ పాతరోజులే వస్తయ్' అని సీఎం కేసీఆర్ అన్నారు. ఓటు వేసేటప్పుడు రాయి ఏందో.. రత్నం ఏందో గుర్తుపట్టాలన్నారు. మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. 'రాహుల్ గాంధీకి ఎద్దు ఎరుకనో.. ఎవుసం ఎరుకనో.. ఎన్నడన్నా దున్నిండో.. నేనైతే కాపుని, నాకైతే ఎవుసం ఉంది.. మరి రాహుల్‌గాంధీకి ఎవుసం ఉందోలేదో నాకైతే తెల్వదు.. కానీ ఆయన ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తామని, గొడ్డలి భుజాన పట్టుకొని రెడీగా ఉన్నారు.. రిజిస్ట్రేషన్ల కోసం వెనకటి లెక్కనే భూమి మీద అధికారుల పెత్తనం వస్తుందని, వారు తలుచుకుంటే ఎవరి భూమిని ఎవరి పేరుకైనా మారుస్తరు.. ధరణి ఉంటే సీఎం కూడా మీ భూమిని ఇంకొకరి పేరు మీదకు మార్చలేడనే విషయం ప్రజలు గుర్తుంచుకోవాలి. అధికారంలోకి వచ్చాక కొత్త మండలాలు ఏర్పాటు చేసుకుందాం.. ఇతర పనులు చేసుకుందాం' అన్నారు.

మధును గెలిపిస్తే లాభం జరుగుతుంది

'కొందరు కొనుక్కపోతున్నారని పుట్ట మధు అధైర్య పడుతున్నారు. కొన్నోడు, అమ్ముడు పోయినోడు ఎవరో ప్రజలకు తెలిసిపోతది. నీవేం రంధిపడకు. ప్రజలకు చైతన్యం ఉంది. ఆ పైసల కోసం మోసపోయేటోళ్లు కాదు ప్రజలు. పోయినసారి జరిగిన నష్టం తెలిసింది. నూరు కథల పడ్డా. ప్రజల మనసులో ఏముందంటే గ్యారెంటీగా బీఆర్ఎస్ సర్కార్ వస్తది. అలాంటప్పుడు మధు ఉంటే లాభమైతది. గవర్నమెంట్ ఉన్న ఎమ్మెల్యేనే రావాలి. అప్పుడే లాభం జరుగుతుంది. మీ మధ్య ఉండే మధును గెలిపిస్తే రూ.1000కోట్ల ప్రత్యేక నిధులతో మంథనిని అభివృద్ధి చేస్తా. బీసీ బిడ్డగా పుట్ట మధుకు అవకాశం వచ్చింది. ఆయనను గెలిపించుకునే బాధ్యత ప్రతీ బీసీ బిడ్డ, ఎస్సీ, ఎస్టీలపైనే ఉంది. హైదారాబాద్‌లో కూసున్నోళ్లకు ఓటు వేస్తే ఏమైతది? భ్రమలోపడి అలాంటి వారికి ఓటు వేస్తే ఏమీ రాదు'

మనోహర్‌రెడ్డి నిస్వార్థపరుడు

'పెద్దపల్లిలో బీఆర్ఎస్ తరఫున పోటీచేసే మనోహర్‌రెడ్డి విద్యావేత్త. ఈ పదేండ్లలో ఒక్కరోజు కూడా వ్యక్తిగత పనుల గురించి నన్ను అడగని నిస్వార్థపరుడు. ఆయనకు డ్రామాలు, నాటకాలు వేసుడు రాదు. దొంగ ధర్నాలు, దొంగ దీక్షలు చేసుడు రాదు. మీ కోసం పనిచేసే వ్యక్తిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించండి'.

మహామహులు ఉన్నా అభివృద్ధికి దూరం..

'మంథని నుంచి ఎన్నికైన పీవీ నరసింహారావు, శ్రీపాదరావు, శ్రీధర్‌బాబు చిత్తశుద్ధితో పనిచేయలేదు. అందుకే ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించలేదు. తెలంగాణ ఏర్పాటయ్యాక పుట్ట మధు నా దగ్గరకు వచ్చి సమగ్రంగా వివరించారు. దీంతో కొన్ని బ్రిడ్జిలు, రోడ్లు నిర్మించుకున్నం. మళ్లీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే పెద్దపల్లి జిల్లాలోని గుంజపడుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాముత్తారం మండలం బోర్లగూడెం గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేస్తాం. నేను కరీంనగర్ నుంచి పోటీ చేసినప్పుడు కాంగ్రెస్ నాయకులు కొనుగోళ్లకు పాల్పడితే ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టిండు. నాకే అత్యధిక ఓట్లు వేశారు. పుట్ట మధు భయపడాల్సిన అవసరం లేదు'.

ప్రచారం.. ఉపాధి..!

- వ్యవసాయ పనులకు తీవ్ర కొరత
- రోజువారి ఆదాయంపై దృష్టి
- హోటళ్లు, పూలదండలకు భలే గిరాకీ



గొల్లపల్లి: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటాపోటీగా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించేలా ర్యాలీలు.. మైకులతో మోత మోగిస్తున్నారు. మహిళల కోలాటాలు, నృత్యాల మధ్య ఓటర్ల వద్దకు చేరుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ వెంట పెద్దఎత్తున జనం ఉండేలా చూస్తున్నారు. ఇందుకు కొందరు రోజువారి కూలీలను ఆశ్రయిస్తున్నారు. ఇది కూలీలకు ఉపాధిలా మారింది. రోజంతా ప్రచారం చేస్తే కొంత నగదుతోపాటు భోజనాలు పెట్టిస్తున్నారు అభ్యర్థులు. దీంతో హోటళ్లు, పూలదండలు, బోకెల వ్యాపారం ఒక్కసారిగా పెరిగింది. ఎన్నికల సమయాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటూ కూలీలు కూడా నాలుగు పైసలు పోగేసుకునే పనిలో పడ్డారు.

పూలదండలకు గిరాకీ..

కండువా మార్చినా.. ప్రచారం కోసం ఊరిలోకి వచ్చే అభ్యర్థికి స్వాగతం పలకాలంటే పూలదండలు, శాలువాలు తప్పనిసరిగా మారింది. సాధారణ రోజులతో పోల్చితే ఎన్నికల ప్రచారం సందర్భంగా దండల అమ్మకాలు పెరిగాయి. అభ్యర్థులు తమ ఇంటి నుంచి ప్రచారం మొదలు పెట్టిన సమయం నుంచి తిరిగి వచ్చేవరకూ అభిమానులు పూలదండలతో ముంచెత్తుతున్నారు. ఫలితంగా పూలదండలు తయారు చేసే వ్యాపారులకు చేతినిండా పని దొరుకుతోంది.

మద్యం.. బిర్యానీతో ఫుల్‌జోష్

పార్టీల తరఫున ప్రచారం చేస్తూ పొద్దంతా తిరుగుతున్న వారు సాయంత్రమైతే చాలు ఇంత 'ముక్క..' ఓ 'సుక్క' వేసుకుని రిలాక్స్ అవుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మద్యం అమ్మకాలు కూడా కొంతమేర పెరిగినట్లు తెలుస్తోంది. అన్ని ప్రధాన పార్టీల నాయకులు కూడా కార్యకర్తలు చేజారిపోకుండా విందుపార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో క్యాటరింగ్ వారికి కూడా చేతినిండా పని దొరుకుతోంది. అలాగే బిర్యానీ సెంటర్లకూ గిరాకీ పెరిగింది.

కళాకారుల ధూంధాం ప్రదర్శనలు

తెలంగాణ అంటేనే ధూంధాం. ఎన్నికల ప్రచారంలో జనాన్ని ఉత్తేజపరచాలంటే కళాకారుల ఆటాపాట ఉండాల్సిందే. ముందస్తు ఎన్నికల్లో ఆయా పార్టీల ప్రచార జోరులో కళాకారులు హోరెత్తిస్తున్నారు. కళాకారులు పాడే పాటలతో ప్రచారానికి ఊపు వస్తోంది. కళాకారులతోపాటు కోలాటం, బతుకమ్మ ఆడే మహిళలకూ కొంత ఉపాధి దొరికినట్లవుతోంది.

డిజిటల్ మార్కెట్..

ఓటర్లను ఆకట్టుకునేలా అభ్యర్థులు అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రచారంలో కీలకభూమిక పోషిస్తున్న సామాజిక మాధ్యమాల వైపు రాజకీయ పార్టీలు చూస్తున్నాయి. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విటర్)తోపాటు ఎస్ఎంఎస్‌లు, వాయిస్‌కాల్స్‌తో అదరగొడుతున్నారు. దీంతో డిజిటల్ మార్కెటింగ్ చేసే చాలామందికి చేతి నిండా పని లభిస్తోంది. ఒక్క ఫోన్‌కాల్‌కు కొంతమొత్తం చొప్పున తీసుకుంటున్నారు.

వాహనాలకు డిమాండ్..

ముఖ్య నేతల ప్రచార సభల నేపథ్యంలో ట్యాక్సీలు, ట్రావెల్స్‌కు డిమాండ్ ఉంది. ఇది వాహన యజమానులకు కలిసి వస్తోంది. ప్రచారానికి నియోజకవర్గ స్థాయిలో తిరుగుతున్న సమయంలో పార్టీల అనుచరగణాన్ని తరలించేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

బిజీబిజీగా కూలీలు..

ఎన్నికల ప్రచారం నేపథ్యంలో రోజువారి కూలీలకు డిమాండ్ పెరిగింది. వ్యవసాయం, ఇతర పనులకు కూలీల కొరత తీవ్రమవుతోంది. వ్యవసాయ పనులకు వెళ్లి పొద్దంతా కష్టపడేకంటే ఒకేరోజు రెండుపార్టీల తరఫున ప్రచారం చేస్తే మేలని భావిస్తున్నారు. ప్రచారంలో అన్ని సౌకర్యాలు ఉండటంతో వెంట వచ్చేందుకు సై అంటున్నారు. అభ్యర్థులు సైతం తాము ప్రచారానికి వెళ్లే సమయంలో జనం కనిపించేలా కూలీలను ముందుగానే బుక్ చేసుకుంటున్నారు.

న్యూస్‌రీల్

పోలీసులకు ఉలెన్ కోట్స్ పంపిణీ



పోలీసులకు ఉలెన్‌కోట్స్ పంపిణీ చేస్తున్న జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: పోలీస్ అధికారులకు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో ఉలెన్ కోట్స్ అందించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా ఉండేందుకు డీజీపీ కార్యాలయం నుంచి కోట్స్ తెప్పించి పంపిణీ చేశామన్నారు. పోలీస్ సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, అడ్మిన్ ఆర్ఐ జానిమియా, ఆర్ఎస్సై వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

రోగులకు సత్వర వైద్యసేవలందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో

జగిత్యాలరూరల్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది సత్వర వైద్య సేవలందించాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట పల్లె దవాఖానా, కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలకు వచ్చే వారికి సత్వర వైద్యం అందించడంతోపాటు, వారికి కావాల్సిన మందులకిట్లను అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రజలకు నమ్మకం కలిగేలా వారికి వైద్యం చేయాలన్నారు. అనంతరం రికార్డులు, కాలపరిమితి ముగిసిన కిట్లను పరిశీలించారు.

పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

సారంగాపూర్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు ప్ర భుత్వం చొరవ చూపాలని, పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్ తెలిపారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదును మంగళవారం బీర్‌పూర్ మండలంలోని పలు పాఠశాలల్లో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నా రు. పెండింగ్ డీఏ, అన్ని రకాల ఏరియర్స్ విడుదల చేయాలని, నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియను కోర్టు ద్వారా పరిష్కరించడానికి చొరవ చూపాలని కోరారు. యూని యస్ జిల్లా బాధ్యులు పేరి మంజునాథ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద కనకయ్య, ముద్దసాని జయాకర్, బండి శ్రీనివాస్, జంగిటి విష్ణుకుమార్ తదితరులు ఉన్నారు.

గొర్రెలకు టీకాలు వేయించాలి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న నరేశ్

రాయికల్: ప్రభుత్వం మంజూరు చేసిన పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలను గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరేశ్ సూచించారు. మంగళవారం రాయికల్ మండలం రామాజీపేట, చింతలూరు గ్రామాల్లో పీపీఆర్ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒకసారి టీకా వేస్తే మూడేళ్ల వరకు జీవాలకు వ్యాధి నిరోధకశక్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీనివాస్, పశువైద్య సిబ్బంది శంకర్, అనిల్, బుచ్చన్న, శంకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధర్మపురి: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు మంగళవారం ప్రారంభించారు. నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి రైతులు మద్దతు ధర పొందాలని సూచించారు. మార్కెట్ కార్యదర్శి భూమన్న తదితరులున్నారు.

మేడిగడ్డ బ్యారేజీపై సీఎం మౌనమెందుకు..?

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: రూ.వేలకోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ పునాదుల నుంచి కుంగిపోయినా.. సీఎం కేసీఆర్ ఎందుకు మౌనం పాటిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. ధర్మపురిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. అందులో ఎందుకు నాణ్యత లోపించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. బ్యారేజీ కుంగిపోవడానికి బాధ్యులెవరో సీఎం కేసీఆర్ ప్రజలకు చెప్పాలన్నారు. బ్యారేజీ కుంగిపోయి 20 రోజులు గడుస్తున్నా ఎందుకు వివరణ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కోటి ఎకరాలకు నీరందిస్తుందంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు తక్కువ సమయంలోనే దెబ్బతినడం అధికారుల నిర్లక్ష్యమేనని చెప్పారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మించారని, మేడిగడ్డ ఘటనలో సీఎంతోపాటు మంత్రులంతా బాధ్యత వహించాలని డిమాండు చేశారు. దినేష్, సింహరాజు ప్రసాద్, రఫీయొద్దీన్ తదితరులున్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

జగిత్యాల: ఎన్నికల విధులను సిబ్బంది సక్రమంగా నిర్వర్తించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అభ్యర్థుల సంఖ్య ప్రకారం ఈవీఎంలు సర్దుబాటు చేసుకోవాలని, అవసరమైతే అదనపు బ్యాలెట్ యూనిట్లను అందిస్తామని తెలిపారు. ఈనెల 18న రెండోదశ ఈవీఎంల ర్యాండమైజేషన్ చేపట్టాలన్నారు. పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను మూడు నెలల వ్యవధిలో పరిష్కరించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు సభల కోసం వచ్చే దరఖాస్తులకు వెంటనే మంజూరు చేయాలని సూచించారు. ఓటరు స్లిప్‌లను నామినేషన్ల తర్వాతే ఇవ్వాలన్నారు. జిల్లాకో నోడల్ అధికారిని నియమించి స్లిప్‌లు పంపిణీ చేయాలన్నారు.

సీ విజిల్‌పై అవగాహన కల్పించాలి : కలెక్టర్ యాస్మిన్ బాషా

సీ విజిల్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణపై అందిన ఫిర్యాదులకు స్పష్టమైన సమాచారాన్ని దరఖాస్తుదారుడికి అందించాలన్నారు. ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ ఇతర టీంలకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరిస్తూ అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు కలెక్టర్లు లత, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 10 నామినేషన్లు

- జగిత్యాలలో ఎనిమిది నామినేషన్లు
- ధర్మపురి, కోరుట్లలో ఒకటి చొప్పున..

జగిత్యాల: జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలకు మంగళవారం పది నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ నుంచి తాటిపర్తి జీవన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. యునైటెడ్ ఫ్రంట్ నుంచి సతీశ్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా కోటగిరి మోహన్, చీటి శ్యామల, మహ్మద్ జమీల్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి భూక్య నందు, కోరుట్ల నుంచి ఆరె రాజేందర్, ధర్మపురి నుంచి స్వతంత్ర అభ్యర్థి తీగల శేఖర్ నామినేషన్ వేశారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న జీవన్‌రెడ్డి

విద్యుత్ ప్రమాదాలు జరగనీయొద్దు

ధర్మపురి: ప్రజలు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ సంస్థ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ధర్మపురి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బందికి మంగళవారం అంతర్గత సమర్థత అభివృద్ధిపై శిక్షణ, విద్యుత్ సంస్థ అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎస్ఈ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఇనుప వస్తువులకు ఎర్తింగ్ చేసుకుంటే షాక్ తగలకుండా నిరోధించవచ్చని సూచించారు. 33కేవి, 11కేవీ లైన్ల నిర్వహణలో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫారాలు అందించడంలో నిర్లక్ష్యం వద్దన్నా రు. డీఈ రాజరెడ్డి, డీఈ ఎమ్మార్టీ రవీందర్, ఎస్ఏవో తిరుపతయ్యా, ఏడీలు, ఏఈ, సిబ్బందిలున్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలే ధ్యేయం



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: బీఆర్ఎస్ పథకాలకు ఆకర్షితులై, చాలామంది పార్టీలో చేరుతున్నారని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. ఇందిరానగర్‌కు చెందిన 20 మంది, 44వ వార్డుకు చెందిన 100 మంది పార్టీలో చేరారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, గట్టు సతీశ్, ప్రధాన కార్యదర్శి ఆనందరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

జగిత్యాలరూరల్: బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అనంతారం, గుట్రాజ్‌పల్లిలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. బీజేపీ, కాంగ్రెస్ నుంచి 100 మంది, తక్కళ్లపల్లి వార్డు మెంబర్ వెంకటేశ్, బాలపల్లి అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు మెడపట్ల మల్లేశ్ బీఆర్ఎస్‌లో చేరారు. గడ్డం హనుమాన్‌రెడ్డి, గుంటి మహేశ్, రమణరెడ్డి తదితరులున్నారు. సంక్షేమ పథకాలు నిరుపేదల కోసమేనని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. అర్బన్ మండలం అంబారిపేటలో ఎమ్మెల్యేకు మద్దతుగా ఆయన సతీమణి రాధికతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్, సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ మల్లారెడ్డి పాల్గొన్నారు.

మేనిఫెస్టో అమలు చేస్తాం

రాయికల్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. రాయికల్ మండలం కిష్టంపేటకు చెందిన సుమారు 30 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని పథకాలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మొద్దని కోరారు. సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీ సభ్యురాలు సారిక, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

పట్టణంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, మహేందర్, లతిక, దివ్య, సోహెల్, కో–ఆప్షన్ మెంబర్ మహేందర్, యూత్ పట్టణ అధ్యక్షుడు రామ్మూర్తి, నాయకులున్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

సారంగాపూర్: గ్రామాలు మరింత అభివృద్ధి సాధించడానికి తనకు మరో అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. బీర్‌పూర్ మండలం కొల్వాయి శ్రీసీతారామాలయంలో పూజలు నిర్వహించారు. తాళ్లధర్మారం, సారంగాపూర్ గ్రామాల్లో పలువురిని పరామర్శించారు. తాళ్లధర్మారంలో నల్ల లత రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందింది. ఆమెకు బీఆర్ఎస్ పార్టీలో బీమా ఉండటంతో బాధిత కుటుంబానికి సంబంధిత చెక్కు అందజేశారు.

చేదు గుళిక.. చక్కెర ఫ్యాక్టరీ

- నష్టాల సాకు.. కష్టాల సాగు..
- షుగర్ ఫ్యాక్టరీపై రాజకీయం
- నేతల హామీలకు దిక్కు లేని వైనం


కోరుట్ల: చెరుకు ఫ్యాక్టరీ.. నేతలకు ఇదో చేదుగుళికగా మారింది. ఫ్యాక్టరీ మూత, తెరిపించడం కోరుట్ల అసెంబ్లీ ఎన్నికల్లో కీలక అంశంగా తయారైంది. ముత్యంపేటలోని షుగర్ ఫ్యాక్టరీ వ్యవహారం ఈ ప్రాంతంలో రైతువర్గాల మొగ్గును నియంత్రించే స్థాయిలో ఉండటంతో అన్ని పార్టీల నాయకులు ఎవరికివారుగా తమకు అనుకూల ప్రచార అస్త్రంగా వాడుకుంటున్నారు. 25 ఏళ్ల క్రితం ఓ వెలుగు వెలిగిన షుగర్ ఫ్యాక్టరీ మూత పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా.. రాజకీయవర్గాల్లో మాత్రం కీలకంగా నానుతూనే ఉంది.

ఆ వైభవమే వేరు..

పదేళ్ల క్రితం వరకు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ ఈ ప్రాంత రైతులకు వరంగా ఉండేది. సుమారు 15 నుంచి 18వేల ఎకరాల్లో చెరుకు సాగైంది. చెరుకు సాగు కోసం ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి అవసరమైన సలహాలు, సూచనలతోపాటు విత్తనాలకూ రుణాలు ఇచ్చి ప్రోత్సహించేవారు. సుమారు 250 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 60 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 2000 మంది సీజనల్ కార్మికులు, వీరి కోసం క్వార్టర్లు, చుట్టపక్కల హోటళ్లు, ఫ్యాక్టరీ ఉద్యోగుల పిల్లల కోసం పాఠశాలలు, పార్కులు ఇలా అన్ని వసతులు ఉండి ఫ్యాక్టరీ ఏరియా కళకళలాడేది. మొత్తంగా రైతులతో కలిపి సుమారు 25వేల మంది ఉపాధికి ఆసరాగా నిలిచింది.

నష్టాల సాకు..

చెరుకు సాగుకు పెద్దగా శ్రమపడాల్సిన అవసరం లేకపోవడంతోపాటు ఎకరాకు ఎంత తక్కువనుకున్నా రూ.80 వేల వరకు ఆదాయం వచ్చేది. 2005 నుంచి నిజాం షుగర్స్ నష్టాల్లో ఉన్నాయన్న కారణంతో వాటిని బాగు చేసేందుకు అప్పటి ప్రభుత్వాలు కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిపి కమిటీలు వేసి నివేదిక కోరాయి. చివరికి 2015 డిసెంబర్‌లో క్రషింగ్ సీజన్‌లో నష్టాల సాకుతో నిజాం షుగర్ ఫ్యాక్టరీలను మూసేశారు. అప్పటి నుంచి ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని కోరుతూ చెరుకు రైతులు ఉద్యమబాట పట్టారు. ప్రతిసారి ఎన్నికల్లో నేతలు చెరుకు ఫ్యాక్టరీ తెరిపించే అంశంపై ఇస్తున్న హామీలు ఉత్తవే అయ్యాయి. చివరికి ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు విస్తీర్ణం 1500 ఎకరాలకు పడిపోయింది. అయినా రైతులు మాత్రం ఫ్యాక్టరీ తెరిపించాలన్న పట్టును మాత్రం వీడడంలేదు. ఫ్యాక్టరీ మూసివేసినప్పటి నుంచి ఇప్పటివరకు నిరంతరంగా రైతు ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి.



మూతపడిన ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ

మింగుడుపడని అంశం

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ షుగర్ ఫ్యాక్టరీ తెరిపించే అంశంపై పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు రైతులకు భిన్నమైన హామీలు ఇచ్చారు. అయినా ఫ్యాక్టరీ మాత్రం తెరుచుకోలేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో చెరుకు, పసుపు రైతులు మూకుమ్మడిగా నామినేషన్లు వేసి అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపారు. ఈ సారి కోరుట్ల అసెంబ్లీ ఎన్నికల్లోనూ చెరకు రైతుల తరఫున కోరుట్ల సెగ్మెంట్‌లో బరిలో దిగేందుకు ఓ నేత సిద్ధం కాగా, ఎక్కువ సంఖ్యలో చెరుకు, పసుపు రైతుల నుంచి నామినేషన్లు వేయించాలన్న యోచనలో ఈ ప్రాంత రైతు సంఘాలు ఉన్నట్లు సమాచారం. మొత్తంగా ప్రతి ఎన్నికల్లో చెరుకు ఫ్యాక్టరీ అంశం ఈ ప్రాంత నేతలకు చేదు గుళికగా మారడం గమనార్హం.

క్లుప్తంగా

రోడ్డుపై జారిపడిన వాహనాలు

- ఒకరికి తీవ్ర గాయాలు



శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నం శివారులో మంగళవారం చిరు జల్లులు పడ్డాయి. దీంతో చెట్ల పైనుంచి జిగురు రోడ్డుపై పడింది. మంగళవారం కరీంనగర్–వరంగల్ రహదారిపై వెళ్తున్న పలువురి వాహనాలు జారిపడ్డాయి. ఈ ఘటనలో మొత్తం 12 మంది వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లికి చెందిన బైక్‌పై బాబుకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది సతీశ్ అతనికి ప్రథమ చికిత్స అందించి, ఆస్పత్రికి తరలించారు.

ఏఐఎఫ్‌బీ చొప్పదండి అభ్యర్థిగా విజయ్‌కుమార్



బీ–ఫాం అందుకుంటున్న విజయ్‌కుమార్

కరీంనగర్: ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ చొప్పదండి అసెంబ్లీ అభ్యర్థిగా ముత్యాల విజయ్‌కుమార్‌ను పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆయన బీ–ఫాం అందుకున్నారు. కరీంనగర్ పట్టణానికి చెందిన విజయ్‌కుమార్ గత కొన్నేళ్లుగా ఏఐఎఫ్‌బీ పార్టీలో పని చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుంటపల్లి చెరువుతండాకు చెందిన మాలోతు భీమ్యా, నవీన్ తమ ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్లి వస్తుండగా కోతి అడ్డుగా రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

‘సాక్షి’ మ్యాథ్ బీ పరీక్షకు స్పందన





మ్యాథ్ బీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లోని రావూస్ మై టోక్నో స్కూల్‌లో నిర్వహించిన ‘సాక్షి’ మ్యాథ్ బీ–2023 పరీక్షకు విశేష స్పందన వచ్చింది. విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. కేటగిరీ–1లో 1, 2వ తరగతుల, కేటగిరీ–2లో 3, 4వ తరగతుల, కేటగిరీ–3లో 5, 6, 7వ తరగతుల, కేటగిరీ–4లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఇన్‌చార్జి స్వప్న, సాక్షి సిబ్బంది మహేందర్ పర్యవేక్షించారు.

కొత్త ప్రాబ్లమ్స్ తెలుసుకున్నాం



మ్యాథ్–బీ లాంటి పరీక్షలు ప్రతీ సంవత్సరం నిర్వహించాలి. అందరికీ ఉపయోగపడే పరీక్ష ఇది. మ్యాథ్స్ సబ్జెక్టులో కొత్త ప్రాబ్లమ్స్ తెలుసుకున్నాం. చాలా బాగుంది.

– జి.సాయి గగన

పరీక్ష డిఫరెంట్‌గా ఉంది



సాక్షి మ్యాథ్ బీ ప్రిలిమినరీ పరీక్ష బాగా రాశాను. సెకండ్ రౌండ్, థర్డ్ రౌండ్ గెలిచి, ఫైనల్ రౌండ్‌కు చేరుకుంటా. ఈ పరీక్ష డిఫరెంట్‌గా ఉంది. మా ఫ్రెండ్స్ కూడా బాగా రాశారు.

– అద్వైత్

గణితంపై పట్టు సాధించా



మ్యాథ్ బీతో గణితంపై పట్టు సాధించా. ఫైనల్‌కు అర్హత సాధిస్తా. ఇంగ్లిష్, మ్యాథ్స్‌లోనే కాకుండా ఇతర సబ్జెక్టుల్లోనూ ఇలాంటి పరీక్ష పెట్టాలి. థాంక్స్ టు సాక్షి.

– బి.కార్తీక

థాంక్స్ టు సాక్షి



ఫస్ట్ టైమ్ సాక్షి మ్యాథ్ బీ పరీక్షలు రాస్తున్నాను. చాలా ప్రాబ్లమ్స్ హార్డ్‌గా ఉన్నాయి. కానీ పరీక్ష బాగా రాశాను. సెకండ్ రౌండ్‌కు ఎంపికవుతా. మా స్కూల్లో చాలామంది రాశారు.

– ఉనైజ్ ఉర్ రెహమాన్

పిల్లలకు ఉపయోగపడే పరీక్ష



సాక్షి మీడియా గ్రూప్ నిర్వహించిన మ్యాథ్ బీ విద్యార్థులకు ఉపయోగపడే పరీక్ష. పిల్లల్లో నాలెడ్జ్ ఇంప్రూవ్ అవుతుంది. ఏటా స్కూల్లో పోటీ పరీక్షలు రాస్తుంటారు. ఈ పరీక్షే బాగుంది.

– కె.స్వప్న, రావూస్ పాఠశాల ఇన్‌చార్జి

సర్వే చేసి చర్యలు తీసుకోండి

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్లలో కాల్వల పక్క భూములు, రోడ్డు మార్జిన్‌ల ఆక్రమణపై సర్వేచేసి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. పిటిషనర్‌కు, అనధికార ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి, సర్వే నిర్వహించాలని, ప్రభుత్వ భూమి అని తేలితే రక్షణ చర్యలు చేపట్టాలని కోరింది. జిల్లాలో కాల్వల పక్క భూములు, రోడ్డు మార్జిన్ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ గంభీరావుపేటకు చెందిన కొక్కు దేవేందర్ యాదవ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం నాలుగు నెలల్లో సర్వేచేపట్టి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది.

దాడి కేసులో నలుగురికి జైలు, జరిమానా

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన కొక్కుల గణేశ్‌పై దాడి చేసిన వ్యక్తులకు ఆరు నెలల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.1,100 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీనిజ కోహిర్కర్ తీర్పునిచ్చారు. ఎస్‌ఐ సదాకర్ వివరాల ప్రకారం.. 2016 ఏప్రిల్ 30న లక్ష్మీపూర్‌కే చెందిన గర్వందుల నరేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మహేశ్‌గౌడ్, సంకీర్తన్ బీరుసీసాతో గణేశ్ తలపై దాడి చేసి, అతని ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. అప్పటి ఎస్‌ఐ ఆరిఫ్ అలీఖాన్ కేసు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్‌రావు, కోర్టు కానిస్టేబుల్ గుండ హరిప్రసాద్ మంగళవారం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా జడ్జి ఆ నలుగురికి శిక్ష విధించారు.

మద్యం అమ్మకాలపై కేసు నమోదు



పట్టుకున్న మద్యం, బైక్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ ద్విచక్ర వాహనంపై మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జరిగిందని ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తూ ద్విచక్రవాహనంపై తిరుగుతూ మద్యం విక్రయిస్తున్న బుర్ర రామచంద్రంపై కేసు నమోదు చేశామన్నారు. అతని నుంచి రూ.6వేల విలువైన మద్యం, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ సిబ్బంది వినయ్, శివ కిషోర్, మల్లేశ్, రాజు, కృష్ణకాంత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

- కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు ఖర్చులు. 9990752820. [T-203]
- వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-1220944]
- పర్సనల్, బిజినెస్, ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతితక్కువ వడ్డీకి వారం రోజులలో రుణం ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. Ph: 9505823875 [H-793381]

BUSINESS OFFER

- Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 9398743067 [H-193274]

WANTED

- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9640400073 [H-189349]
- మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [M-1221903]
- Urgently Required: విడాల్ ఇంజన్ ఆయిల్స్‌లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: సెల్: 7207907811. [K-1185670]
- రామకృష్ణ గ్రూపు, (TS No.1) HYD, VJA, శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. TS & AP అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52838, 82474 49036. [B-1206468]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

ప్రజల విరాళాలతో నామినేషన్



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న బీఎస్పీ అభ్యర్థి ఉష

పెద్దపల్లిరూరల్: ‘నాకు నోటు ఇవ్వండి.. ఓటు వేయండి’ అని పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కొంతకాలంగా విస్తృత ప్రచారం చేస్తున్న బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష.. ప్రజలు ఇచ్చిన విరా ళాలతోనే మంగళవారం తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నాయకుడు ఈర్ల కొమురయ్య, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, కౌన్సిలర్లు బొంకూరి భాగ్యలక్ష్మి, పోతని పురుషోత్తం, సాబీర్‌ఖాన్, కార్తీక్, నాయకులు మల్రెడ్డిపల్లి సతీశ్, సిరవేని స్వప్న తదితరులతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ (ఆర్డీవో) కార్యాలయానికి చేరుకున్నారు. ప్రజల నుంచి సేకరించిన రూ.1,67,300తో ఫీజు చెల్లించి నామినేషన్ దాఖలు చేసినట్లు బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మీనారాయణ (ఫైల్)

తంగళ్లపల్లి (సిరిసిల్ల): ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిలివేరి లక్ష్మీనారాయణ (45) సిరిసిల్ల మున్సిపాలిటీలో ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతేడాది చెల్లెలి వివాహం కోసం రూ.4.50 లక్షలు అప్పు చేశాడు. మంగళవారం ఉదయం ఎవరూ లేని సమయంలో ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడికి తండ్రి ఎల్లయ్య, భార్య బాబాయి, కొడుకు మనోజ్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోర్నపల్లి చెక్‌పోస్టు ఒడ్డెలింగాపూర్‌కు మార్పు

రాయికల్(జగిత్యాల): మండలంలోని బోర్నపల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఒడ్డెలింగాపూర్‌కు మార్చినట్లు ఎస్‌ఐ అజయ్ తెలిపారు. చెక్‌పోస్టును ఈ గ్రామంలో ఏర్పాటు చేయడం వల్ల తనిఖీలు విస్తృతంగా చేపట్టే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నిబంధనలను అందరూ పాటించాలని కోరారు.

ధర్మారంలో రోడ్డు ప్రమాదం

- ఒకరి పరిస్థితి విషమం, మరొకరికి గాయాలు

ధర్మారం(ధర్మపురి): మండలకేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ధర్మారం గ్రామానికి చెందిన మేడి రవీందర్ తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా నడుచుకుంటూ వస్తున్న రాజస్థాన్‌కు చెందిన మనోజ్, అతని మూడేళ్ల కుమారుడిని వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో మనోజ్‌కు గాయాలు కాగా రవీందర్‌కు తలకు తీవ్ర గాయమైంది. పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు రవీందర్‌ను కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

30 క్వింటాళ్ల మక్కలు చోరీ

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఇబ్రహీంపట్నం, గొధూర్ గ్రామాల్లో ముగ్గురు రైతులకు చెందిన 30 క్వింటాళ్ల మక్కలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంపట్నంలో వర్షకొండకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన గజ్జ రమేశ్‌కు చెందిన 10 క్వింటాళ్ల మక్కలను కొనుగోలు చేసి ఉంచారు. గొధూర్ వైపు వెళ్లే దారిలో నాగుల శ్రీనివాస్‌కు చెందిన 5 క్వింటాళ్లు, గొధూర్ గ్రామంలో ఓంకారి రాముకు చెందిన 15 క్వింటాళ్ల మక్కలను సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత



నిందితుడు, గంజాయిని చూపుతున్న సీఐ ఆరిఫ్ అలీఖాన్

రాయికల్(జగిత్యాల): ఓ వ్యక్తి కిలోన్నర గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ వివరాల ప్రకారం.. రాయికల్ పట్టణంలోని ఇటిక్యాల క్రాసింగ్ వద్ద ఎస్‌ఐ అజయ్ తన సిబ్బందితో కలిసి మంగళవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌కు చెందిన మెస్రం నగనాథ్ చేతిలో సంచితో నడుచుకుంటూ వెళ్తున్నాడు. అతను అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి, తనిఖీ చేయగా కిలోన్నర గంజాయి దొరికింది. దాని విలువ రూ.37,500 ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. అతని వద్ద నుంచి గంజాయి తోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ అజయ్‌ని, కానిస్టేబుళ్లు అశోక్, రామకృష్ణలను సీఐ అభినందించారు.

రూ.60 వేలు..

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ శివారులో మంగళవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి బైక్‌పై రూ.60 వేలు తీసుకెళ్తుండగా పట్టుకున్నామని ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. అతను సరైన పత్రాలు చూపించకపోవడంతో డబ్బులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో డబ్బు తీసుకెళ్లవద్దని సూచించారు.

చండీగఢ్‌లో పోసానిపేట యువతి బలవన్మరణం



అంజలి (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని పోసానిపేటకు చెందిన గంగాధరి అంజలి(19) ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గంగాధరి చిన్నయ్య–లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, కూతురు అంజలి ఉన్నారు. ఆమె ఇంటర్మీడియట్ పూర్తి చేసి, చండీగఢ్ పట్టణంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ కంపెనీలో నాలుగు నెలలుగా పని చేస్తోంది. అక్కడ మంచి వేతనం ఇస్తుండటంతో కుటుంబసభ్యులు కూడా సంతోషించారు. అంజలి దసరా పండుగకు పోసానిపేటకు వచ్చి, వెళ్లింది. మంగళవారం ఉదయం ఆమె ఉరేసుకొని, ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులకు ఫోన్‌లో సమాచారం వచ్చింది. అంజలి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు సర్పంచ్ మిట్టపెల్లి గంగారెడ్డి, కుటుంబసభ్యులు, బంధువులు మంగళవారం మధ్యాహ్నం చండీగఢ్ వెళ్లారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.

కలెక్టర్ ల్యాప్‌టాప్ దొంగిలించిన వ్యక్తి అరెస్టు



ప్రసాద్ అరెస్టు చూపుతున్న పోలీసులు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ గత కలెక్టర్ బి.గోపి ల్యాప్‌టాప్‌తోపాటు ఇతర వస్తువులు దొంగిలించిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఉప్పులూరుకు చెందిన పగిడిపల్లి ప్రసాద్ కూలీ పని చేసుకుంటూ తన గ్రామంలో చోరీలు చేసేవాడు. దీంతో గ్రామస్తులు దేహశుద్ధి చేసి, ఊరినుంచి తరిమికొట్టారు. వారం రోజుల క్రితం కరీంనగర్ వచ్చి, కూలీ పనులు చేసుకుంటూ మద్యం సేవించి, బస్టాండ్‌లో నిద్రించేవాడు. గత నెల 29న రాత్రి మద్యం తాగి, కలెక్టర్ క్యాంపు కార్యాలయ రోడ్డులో వెళ్తున్నాడు. అక్కడ ఎవరూ లేకపోవడంతో కలెక్టర్ బంగ్లా లోపలికి వెళ్లి, ఆయనకు సంబంధించిన ల్యాప్‌టాప్, చార్జర్, పెన్‌డ్రైవ్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, బ్యాగ్ మొత్తం రూ.75 వేల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లాడు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సిబ్బంది వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రసాద్‌ను గుర్తించారు. అతన్ని అరెస్టు చేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు. దొంగను పట్టుకున్న సీఐ రవికుమార్, సిబ్బందిని అభినందించారు.

దారి కాచి.. నగదు ఎత్తుకెళ్లి..

- బ్యాంకు నుంచి డ్రా చేసిన రూ.4 లక్షలు ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు
- పట్టపగలే సిరిసిల్లలో ఘటన



బాధితుడు రాజనర్సు

సిరిసిల్లటౌన్: బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసుకొని వెళ్తున్న వ్యక్తి నుంచి దుండగులు దోపిడీకి పాల్పడిన సంఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిలుముల రాజనర్సు అనే రిటైర్డ్ ఉద్యోగి స్థానిక బ్యాంకు నుంచి రూ. 4లక్షలు డబ్బులు డ్రా చేసుకుని ఇంటికి వెళ్తున్నాడు. నటరాజ్ థియేటర్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వ్యక్తులు ప్రధాన రోడ్డుపై రాజనర్సు వద్ద నుంచి నగదును ఎత్తుకెళ్లారు. స్థానికులు వెంబడించినా వారు దొరకలేదు. రాజనర్సు తలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ పేర్కొన్నారు.

కళాశాలలో వీడియో చిత్రీకరణపై ఫిర్యాదు

- సిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కోల్‌సిటీ(రామగుండం): ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఓ పార్టీకి అనుకూలంగా వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేసిన తీరుపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గోదావరిఖనిలోని సిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాలేజీ ఆవరణలోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి, ఓ పార్టీకి ఓటు వేయాలని కోరుతూ వీడియో చిత్రీకరించారన్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై విచారణ జరిపించామని, నివేదిక కలెక్టర్‌కు అందించనున్నట్లు పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులను కళాశాల ఆవరణలోకి అనుమతించిన సెక్యూరిటీ విభాగం సూపర్‌వైజర్‌ను టర్మినేట్ చేసి, సదరు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ సంస్థకు మెమో జారీ చేసినట్లు తెలిపారు. కళాశాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో ఎమర్జెన్సీ చికిత్స కోసం వచ్చే పేషెంట్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కొత్త బ్లాక్‌కు ఆక్సిజన్, రోడ్డు నిర్మాణ తదితర పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆర్ఎంవో డాక్టర్ అరుణ, డాక్టర్ అనంతబాబు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్‌తో పారదర్శకత

- మూడు దశల్లో ఈవీఎంల మార్పు



ఇటీవల పూర్తయిన ర్యాండమైజేషన్

కరీంనగర్‌అర్బన్: ఎన్నికలంటేనే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల పాత్ర కీలకం. వీటి వినియోగం విభిన్నం. ర్యాండమైజేషన్ పద్ధతిలో ఈవీఎంలను కేటాయిస్తుండగా రాజకీయ పార్టీల నేతల ఆధ్వర్యంలోనే నిర్వహించడం పరిపాటి. ఇప్పటికే మొదటి దశ పూర్తయింది. దీంతో ఏ మెషిన్ ఎక్కడికి చేరుతుందన్నది ఎవరికీ తెలియదన్న మాట. ప్రతీ ఓటు కీలకం కావడంతో ఈవీఎంలపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తుంటారు. అవి వంద శాతం పారదర్శకంగా పని చేస్తాయని.. వీటిపై అపోహలు అనవసరమని అధికారులు చెబుతున్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు ఉన్న అపోహలను తొలగించేందుకు ఎన్నికలకు ముందే ఈవీఎంలను పరిశీలించే మాక్ ప్రక్రియనే ర్యాండమైజేషన్ అంటారు. ఇటీవల పంపిణీ కేంద్రాల నుంచి ఈవీఎంలు నియోజకవర్గ కేంద్రాల్లోని రూమ్‌లకు చేరాయి.

మొదటి విడత పూర్తి

ఈవీఎంలను జిల్లా ఎన్నికల అధికారి నుంచి మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా పంపిణీ కేంద్రాలకు అక్కడి నుంచి నియోజకవర్గ కేంద్రాలకు తరలిస్తారు. మొత్తం ఈవీఎంలలో నియోజకవర్గాలోని పోలింగ్ కేంద్రాల ఆధారంగా 30శాతం చొప్పున అదనంగా కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు బ్యాలెట్ 40 శాతం నియోజకవర్గాలకు తరలిస్తారు. ఈ ప్రక్రియలో ఎన్నికల అధికారులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనడం పరిపాటి. స్ట్రాంగ్ రూంలలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే భద్రపరచి గదికి సీల్ వేస్తారు. ఈ ప్రక్రియ ఇటీవలే పూర్తయింది.


యంత్రాల పరిశీలనకు మాక్ పోలింగ్

ఈవీఎంలోని భాగాలైన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరును పరిశీలించేందుకు పోలింగ్‌కు గంటన్నర ముందు అభ్యర్థుల ఏజెంట్లు, ఎన్నికల అధికారుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఒక్కో ఈవీఎంపై 15 మంది అభ్యర్థులు, నోటా గుర్తులు ఉంటాయి. అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే మరో ఈవీఎంను ఏర్పాటు చేస్తారు. మాక్ పోలింగ్‌లో ఒక్కో అభ్యర్థికి 50 ఓట్లు వేసి వాటికి సంబంధించిన వీవీ ప్యాట్‌లోని చిట్టీలను లెక్కిస్తారు. వేసిన ఓట్లు, వీవీ ప్యాట్ చిట్టీలు సరిగ్గా ఉంటే పోలింగ్‌కు అనుమతిస్తారు.

రెండో, మూడో విడత ర్యాండమైజేషన్ ఇలా..


నియోజకవర్గ కేంద్రాలకు వచ్చిన ఈవీఎంలపై బ్యాలెట్ కాగితాలు అతికించి.. ఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండో విడత ర్యాండమైజేషన్ (ఈవీఎంల గజిబిజి కేటాయింపు) ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో ఓట్లు సక్రమంగా పడుతున్నాయా.. ఏమైనా లోపాలున్నాయా అనేది గుర్తిస్తారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇందులో ఏమైనా అనుమానాలు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్తారు. మూడో దశలో నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలించడమే మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ. ఈ ప్రక్రియలో ఆర్వో, ఎన్నికల పరిశీలకులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం పాల్గొంటారు. పోలింగ్‌కు ముందు రోజు ఈవీఎంలను కేంద్రాలకు తరలిస్తారు.

అందని ‘పీఎం కిసాన్’



రామగుండం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పరిహారం 2019 ఫిబ్రవరికి ముందు పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్న రైతులకు మాత్రమే పరిహారం అందుతోంది. ఫలితంగా గడిచిన నాలుగేళ్లుగా భూ క్రయ విక్రయాలు జరపగా కొత్తగా పాస్‌బుక్‌లు వచ్చినవారికి మాత్రం పీఎం కిసాన్ పరిహారం అందకపోవడంపై రైతులు నిరాశ చెందుతున్నారు.

ఏడాదిగా పరిహారం రాలేదు



2020 ఫిబ్రవరిలో ఎగ్లాస్‌పూర్ గ్రామంలో 20 గుంటల భూమి కొనుగోలు చేశా. పీఎం కిసాన్ సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినప్పటికీ పరిహారం అందడం లేదు. 2019 ఫిబ్రవరి ముందు పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉన్న రైతులకు మాత్రమే పరిహారం అందుతుందని అధికారులు తెలుపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కటాఫ్ తేదీని పెంచితే లక్షలాది మంది రైతులకు పరిహారం అందుతుంది.

– బుద్దె మహేశ్, వినంపేట, రైతు

భూమితో సంబంధం లేకుండా పరిహారం



నూతనంగా భూమి కొనుగోలు చేసిన రైతులు కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లోనే దరఖాస్తు చేసుకోవడంతో సదరు వివరాలు తమకు తెలియవు. నూతనంగా కేంద్రం కటాఫ్ తేదీని సవరిస్తేనే నూతన లబ్ధిదారులకు పరిహారం అందే అవకాశం ఉంటుంది. పరిహారం పంపిణీ విషయంలో తమ ప్రమేయం లేదు.

– భూక్య రాంబాబు, ఏవో, అంతర్గాం

సాక్షి బిజినెస్
బుధవారం
8-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
16	5
64,942	19,407

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,615	△	93
డోజోన్స్	34,141	△	45
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,410	▽	8
డాక్స్	15,153	△	17
షాంఘై	3,057	▽	1
నికాయ్	32,708	▽	448

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,579	▽	474
బంగారం (99.5 స్వచ్ఛత)	60,336	▽	472
వెండి (కిలో)	72,705	▽	1,332

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటి	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎకటి	99.99	103.36
€	యూరో	ఎకటి	87.01	90.10
¥	జపాన్ ఎన్ (100)	ఎకటి	54.58	56.26
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎకటి	52.53	54.84
S$	సింగపూర్ డాలర్	ఎకటి	60.20	62.14
SAR	సౌదీ రియాల్	భారతీయకర	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయకర	21.65	23.49
¥	చైనా యువాన్	భారతీయకర	10.29	12.38

స్వల్పంగా పెరిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణ రేటు



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొన్ని కాలపరిమితుల రుణాలపై వడ్డీ రేటును స్వల్పంగా 0.05 శాతం (ఐదు బేసిస్ పాయింట్లు) పెంచింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గడచిన ఐదు ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లోనూ రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5%) పెంపుపై ఎటువంటి నిర్ణయం తీసుకోనప్పటికీ, హెచ్‌డీఎఫ్‌సీ తాజా రేటు పెంపు నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 8.65 శాతానికి పెరిగింది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ 9.30 శాతానికి ఎగసింది. కాగా, సాధారణంగా అధిక రుణాలకు ప్రాతిపదిక అయిన ఏడాది రుణ రేటు మాత్రం 9.20 శాతం వద్ద స్థిరంగా ఉంది.

హైదరాబాద్‌లో రిలయన్స్ స్వదేశ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ 'స్వదేశ్' తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసింది. రిలయన్స్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్‌పర్సన్ నీతా అంబానీ చేతుల మీదుగా నేడు (బుధవారం) ఈ స్టోర్ ప్రారంభం కానుంది. సుమారు 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది కొలువుదీరింది. చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఫర్నిచర్, బొమ్మలు, ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు, పెయింటింగ్స్, యాక్సెసరీస్‌తోపాటు వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తారు. దేశవ్యాప్తంగా చేతి వృత్తుల కళాకారులకు చెందిన గుర్తింపు ఉన్న సంఘాల నుంచి నేరుగా వీటిని సేకరిస్తారు. రూ.6 లక్షలకుపైగా ధర పలికే వస్తువులనూ విక్రయిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

08-11-2023	
విశాఖ	530-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
07-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

వుయ్‌వర్క్ దివాలా!

- వ్యాపార పునర్వ్యవస్థీకరణపై దృష్టి
- లీజుల క్రమబద్ధీకరణకు కసరత్తు



న్యూయార్క్: ఆఫీస్ స్పేస్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన అంతర్జాతీయ దిగ్గజం వుయ్‌వర్క్ దివాలా ప్రకటించింది. వ్యాపారాన్ని యథాప్రకారం కొనసాగిస్తూ, కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరించుకునే దిశగా అమెరికాలో చాప్టర్ 11 దివాలా పిటిషన్ దాఖలు చేసింది. వ్యాపార పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది. కమర్షియల్ ఆఫీస్ లీజుల పోర్ట్‌ఫోలియోను మరింత క్రమబద్ధీకరించుకోనున్నట్లు పేర్కొంది. రుణభారాన్ని గణనీయంగా తగ్గించుకునే దిశగా పునర్వ్యవస్థీకరణ విషయంలో తోడ్పాటు అందించేలా సంబంధిత వాటాదారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. అమెరికా, కెనడా వెలుపలి దేశాల్లోని తమ కార్యకలాపాలపై ఈ పరిణామ ప్రభావం ఉండబోదని వుయ్‌వర్క్ వివరించింది. సమస్యలను పరిష్కరించుకుని, వ్యాపారాన్ని మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగడంపై దృష్టి పెడుతున్నట్లు సంస్థ సీఈవో డేవిడ్ టోలీ ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ ఈ ఏడాది ప్రథమార్ధంలో 696 మిలియన్ డాలర్ల నష్టం నమోదు చేసింది. జూన్ 30 నాటికి వుయ్‌వర్క్‌కు 39 దేశాల్లో 777 చోట్ల కార్యకలాపాలు ఉన్నాయి.

అప్పట్లో 50 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్ ..

గతంలో దాదాపు 50 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో వెలుగొందిన వుయ్‌వర్క్ దివాలా తీయడానికి అనేక కారణాలు ఉన్నాయి. అతి దూకుడుగా విస్తరించడం, వ్యవస్థాపకుడు ఆడమ్ న్యూమాన్ పోకడలు మొదలైనవి ఇందుకు దారితీశాయి. వాస్తవానికి కొన్నాళ్ల క్రితం నుంచే దివాలా సంకేతాలు కనిపించడం మొదలైంది. 2019లో తొలి పబ్లిక్ ఇష్యూ ప్రయత్నం ఘోరంగా విఫలం కాగా ఆ తర్వాత 2021లో ఐపీవోకి వచ్చినా వేల్యుయేషన్ అనేక రెట్లు తగ్గి 9 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతకన్నా ముందే కంపెనీ, వ్యవస్థాపకుడి పనితీరుపై ఇన్వెస్టర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో.. న్యూమాన్ ఉద్వాసనకు గురయ్యారు. సంస్థలో మెజారిటీ వాటాలు తీసుకున్న జపాన్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్.. కంపెనీని నిలబెట్టేందుకు ప్రయత్నించింది. నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవడం, ఆదాయాన్ని పెంచుకోవడం వంటి ప్రయత్నాలు జరిగినా పెద్దగా ఫలితం లేకపోయింది. వ్యాపారాన్ని కొనసాగించే సామర్థ్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయంటూ వుయ్‌వర్క్ ఆగస్టులోనే వెల్లడించింది. ఆ తర్వాత లీజులన్నింటినీ పునఃసమీక్షించుకునే యోచనలో ఉన్నట్లు సెప్టెంబర్‌లో ప్రకటించింది. నష్టాల్లో ఉన్న లొకేషన్ల నుంచి వైదొలగనున్నట్లు తెలిపింది.

భారత్‌లో ప్రభావం ఉండదు..

వుయ్‌వర్క్ గ్లోబల్ దివాలా ప్రభావం భారత విభాగంపై ఉండదని వుయ్‌వర్క్ ఇండియా సీఈవో కరణ్ విర్వాణి స్పష్టం చేశారు. దివాలా ప్రక్రియలో భారత వ్యాపారం భాగంగా లేదని తెలిపారు. వుయ్‌వర్క్ ఇండియాలో రియల్ ఎస్టేట్ సంస్థ ఎంబసీ గ్రూప్‌నకు 73 శాతం, వుయ్‌వర్క్ గ్లోబల్‌కు 27 శాతం వాటాలు ఉన్నాయి. భారత్‌లో ఏడు నగరాల్లో వుయ్‌వర్క్ ఇండియాకు 50 కేంద్రాలు ఉన్నాయి. 2021 జూన్‌లో వుయ్‌వర్క్ ఇండియాలో వుయ్‌వర్క్ గ్లోబల్ 100 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది.

బ్యాంకింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఫిన్‌టెక్

'ఆర్‌బీఐ' నివేదిక



ముంబై: సమీప భవిష్యత్తులో సాంప్రదాయ బ్యాంకింగ్‌కు ఫిన్‌టెక్ రంగం ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ ఫైనాన్షియల్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ (కెఫ్రాల్) ఒక నివేదికలో పేర్కొంది. డిజిటలీకరణ వృద్ధికి, ఆర్థిక స్థిరత్వ సాధనకు ఎప్పటికప్పుడు తగు విధంగా మల్చుకోగలిగే నియంత్రణ విధానాలు అవసరమని తెలిపింది. ఇండియా ఫైనాన్స్ రిపోర్ట్ 2023 పేరిట కెఫ్రాల్ రూపొందించిన తొలి ప్రచురణను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం విడుదల చేశారు. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు 2011లో కెఫ్రాల్‌ను లాభాపేక్ష రహిత సంస్థగా ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. దేశీయంగా బ్యాంకిగేతర ఆర్థిక రంగ స్థితిగతులను అర్థం చేసుకోవడంలో నియంత్రణ సంస్థలు, విధాన నిర్ణేతలు సహా సంబంధిత వర్గాలకు సహాయకరంగా ఉండే అంశాలను తాజా నివేదికలో పొందుపర్చారు. దేశీ సాంకేతిక తోడ్పాటుతో భారత్‌లో డిజిటలీకరణ వేగవంతమవుతోందని, డిజిటల్ రుణాలు.. ముఖ్యంగా ఫిన్‌టెక్ రుణాలు గణనీయంగా పెరిగాయని నివేదిక పేర్కొంది.

పవర్ గ్రిడ్ లాభం అప్

క్యూ2లో రూ. 3,781 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్ గ్రిడ్ కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 3,781 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,650 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,349 కోట్ల నుంచి రూ. 11,530 కోట్లకు ఎగసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. డిసెంబర్ 6కల్లా చెల్లించనుంది.

ఫలితాల నేపథ్యంలో పవర్ గ్రిడ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో దాదాపు యథాతథంగా రూ. 208 వద్ద ముగిసింది.

జోయాలుక్కాస్ దీపావళి క్యాష్‌బ్యాక్ ఆఫర్లు



హైదరాబాద్: దీపావళి సందర్భంగా జోయాలుక్కాస్ క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ప్రకటించింది. రూ.50,000 విలువైన డైమండ్, అన్ కట్ డైమండ్స్-ప్రెషస్ జ్యువెలరీ కొనుగోలుపై రూ.2 వేల విలువైన క్యాష్‌బ్యాక్ గిఫ్ట్ వోచర్ పొందవచ్చు. అలాగే రూ.50 వేల విలువైన బంగారం ఆభరణాల కొనుగోలుపై రూ.1000 విలువైన క్యాష్‌బ్యాక్ గిఫ్ట్ వోచర్, రూ.10వేల విలువైన వెండి ఆభరణాలపై రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్లు అందిస్తుంది. అడ్వాన్స్ బుకింగ్ స్కీమ్‌తో షాపింగ్ చేసే కస్టమర్లు ప్రోత్సాహక బహుమతి పొందొచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఆఫర్లు నవంబర్ 12 వరకు అమలులో ఉంటాయి. క్యాష్‌బ్యాక్ రూపంలో కస్టమర్లకు మేమిచ్చే బహుమతులు వారి దీపావళిని మరింత శోభాయమానం చేస్తాయని సంస్థ ఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

3 రోజుల లాభాలకు బ్రేక్

- స్వల్ప నష్టాల ముగింపు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం



ముంబై: దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగడంతో స్టాక్ సూచీల 3 రోజుల వరుస లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. ఆసియా, యూరప్ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఛత్తీస్‌గఢ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించారు. ట్రేడింగ్‌లో 383 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 16 పాయింట్ల స్వల్ప నష్టంతో 64,942 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి ఐదు పాయింట్ల నష్టంతో 19,407 వద్ద నిలిచింది. చైనా అక్టోబర్ ఎగుమతులు భారీగా క్షీణించినట్లు డేటా వెల్లడికావడంతో ఆసియాలో ఒక్క తైవాన్ తప్ప మిగిలిన అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% నష్టపోయాయి. కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాల ప్రకటన, ఇంధన షేర్ల పతనంతో యూరప్ మార్కెట్లు ఒకశాతం మేర పతనమయ్యాయి.

- హోనాసా కన్జూమర్ లిస్టింగ్ పర్వాలేదనిపించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.324) వద్దే లిస్టయ్యింది. చివరికి 4% లాభంతో రూ.337 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.10,848 కోట్లుగా నమోదైంది.
- ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓ చివరిరోజు నాటికి 73.15 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది. 5.77 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 422 కోట్ల ఈక్విటీలకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 173.52 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 84.37 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 16.97 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.

మ్యాక్సివిజన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోని



చెన్నై: కంటి సంరక్షణ సేవల సంస్థ మ్యాక్సివిజన్‌సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ తాజాగా క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనిని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. అన్ని వర్గాలకు చిరపరిచితమైన ధోని వంటి దిగ్గజంతో జత కట్టడమనేది.. క్రమం తప్పకుండా కంటి చెకప్‌లు చేయించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచడానికి దోహదపడగలదని సంస్థ సీఎండీ జీఎస్‌కే వేలు తెలిపారు. చౌకగా కంటి సంరక్షణ సేవలను అందరికీ అందుబాటులోకి తేవాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. తమ నెట్‌వర్క్‌లోని 40కిపైగా ఆస్పత్రుల్లో నిత్యం వేల కొద్దీ పేషెంట్లకు సర్వీసులు అందిస్తున్నామని సంస్థ సీఈవో సుధీర్ వీఎస్ తెలిపారు.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

విద్యార్థులకు సాక్షి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో..'చిల్డ్రన్స్ డే' పోటీలు
1. Quiz on India's Freedom Movement 2. Photo Contest
పూర్తి వివరాలకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 04
» అర్హత: పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఎంబీఏ(హెచ్ఆర్) చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.32,000.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.11.2023
» వెబ్‌సైట్: www.nirdpr.in

పీజీసీఐఎల్, న్యూఢిల్లీలో 10 ఆఫీసర్ ట్రైనీ(లా) పోస్టులు

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్).. క్లాట్ 2024 స్కోరు ద్వారా ఆఫీసర్ ట్రైనీ(లా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 10
» అర్హత: 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ లేదా ఇంటిగ్రేటెడ్ లా/ఎల్ఎల్‌బీ కోర్సు ఉత్తీర్ణతతో పాటు క్లాట్–2024 స్కోరు సాధించి ఉండాలి.
» వయసు: 29.11.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: క్లాట్–2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 09.11.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 29.11.2023
» వెబ్‌సైట్: www.powergrid.in

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో 13 ఉద్యోగాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 13
» పోస్టుల వివరాలు: జిల్లా కోఆర్డినేటర్–1, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్–1, బ్లాక్ కోఆర్డినేటర్–11.
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
» వేతనం: నెలకు జిల్లా కోఆర్డినేటర్‌కు రూ.30,000. జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ. 18,000. బ్లాక్ కోఆర్డినేటర్‌కు రూ.20,000
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బాలసదన్ పక్కన, పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 10.11.2023.
» వెబ్‌సైట్: allurisitharamaraju.ap.gov.in

బెల్ బెంగళూరులో 16 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగళూరు కాంప్లెక్స్.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 16
» అర్హత: బీఈ, బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ /ఎలక్ట్రానిక్స్ /టెలికమ్యూనికేషన్/కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ /ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్).
» వేతనం: నెలకు రూ.40,000 నుంచి రూ.55,000 వరకు ఉంటుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 18.11.2023
» వెబ్‌సైట్: www.belindia.in

నంద్యాల జిల్లా మహిళా,శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయంలో 23 పోస్టులు

నంద్యాల జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 23
» పోస్టుల వివరాలు: జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ –01, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, లీగల్ కమ్ ప్రొటెక్షన్ ఆఫీసర్–01, కౌన్సిలర్–01, సోషల్ వర్కర్–02, అకౌంటెంట్–01, డేటా అనలిస్ట్–01, అసిస్టెంట్ కమ్ డేటాఎంట్రీ ఆపరేటర్–01, అవుట్‌రీచ్ వర్కర్స్ –02, మేనేజర్/కోఆర్డినేటర్(మహిళలు)–01, సోషల్ వర్కర్ కమ్–ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్ (మహిళలు)–01, నర్సు(మహిళలు)–01, డాక్టర్(పార్ట్‌టైమ్)–01, ఆయా(మహిళలు)–06, చౌకీదార్(మహిళలు)–01.
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంటర్,డిగ్రీ,పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, బొమ్మలసత్రం, నంద్యాల చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 10.11.2023.
» వెబ్‌సైట్: nandyal.ap.gov.in

ఐఐఎంల్లో.. సమ్మర్ ప్లేస్‌మెంట్స్ హవా!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా ఐఐఎం! మేనేజ్‌మెంట్ విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ.. విద్యార్థులకు నిత్యనూతన నైపుణ్యాలు అందించడంలో.. ముందుండే ఇన్‌స్టిట్యూట్స్!! వీటిలో కోర్సులు పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ సంస్థల రెడ్ కార్పెట్ స్వాగతం ఖాయం అనే అభిప్రాయం! ఐఐఎంల్లో ఇటీవల సమ్మర్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ మొదలైంది! పలు సంస్థలు భారీ స్టయిఫండ్‌తో ఎస్‌పీఓలు ఖరారు చేస్తున్నాయి! ఈ నేపథ్యంలో.. ఐఐఎంల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ తాజా ట్రెండ్స్, అవకాశాలు కల్పిస్తున్న రంగాలు, స్టయిఫెండ్స్ తదితర వివరాలు..

» ఐఐఎంలలో మొదలైన ఎస్‌పీఓ ప్రక్రియ
» పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో వందశాతం ఆఫర్లు
» సగటున రూ.2 లక్షల స్టయిఫండ్

కార్పొరేట్ సంస్థలకు ఐఐఎం విద్యార్థులు హాట్ కేక్స్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయా కంపెనీలకు అవసరమైన నిర్వహణ నైపుణ్యాలు ఐఐఎంల విద్యార్థుల్లో ఉంటాయని భావించడమే ఇందుకు నిదర్శనం. తాజాగా ఐఐఎంలలో కొనసాగుతున్న ఎస్‌పీఓ ప్రక్రియ, అందిస్తున్న ఆఫర్లే ఇందుకు నిదర్శనం అంటున్నారు నిపుణులు.

సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌గా

ఐఐఎం పీజీ ప్రోగ్రామ్‌ల్లో చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం పూర్తయ్యాక లభించే సెలవు రోజుల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్ చేస్తారు. అంతకు ముందు కంపెనీలు విద్యార్థులను ఇంటర్న్ ట్రైనీగా ఎంపిక చేసేందుకు ప్రత్యేక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నెగ్గిన విద్యార్థులకు సంస్థలు రెండు వారాల వ్యవధిలో ఇంటర్న్ ట్రైనీగా విధులు నిర్వహించడానికి అవకాశం కల్పిస్తాయి. ఇలా ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారికి స్టయిపండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందిస్తాయి. ఇది రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది.

అందరికీ ఆఫర్స్

- 2023–25 బ్యాచ్ విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ వెల్లువెత్తున్నాయి.
- ఐఐఎం–లక్నోలో మొత్తం 576 మంది విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించాయి. వీరికి సగటు స్టయిఫండ్ నెలకు రూ 1.31 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.5 లక్షలుగా నిలవడం గమనార్హం.
- ఐఐఎం–కోల్‌కతలో.. 466 మంది విద్యార్థులకు గాను అందరికీ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించడం విశేషం. వీరికి సగటు స్టయిఫండ్ రూ.1.65 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.75 లక్షలుగా ఉంది.
- ఐఐఎం–నాగపూర్‌లోనూ నూటికి నూరు శాతం విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. సగటు స్టయిఫండ్ రూ.79 వేలుగా ఉంది.

కొనసాగుతున్న ప్రక్రియ

దేశంలోని ఇతర ఐఐఎంలలోనూ ప్రస్తుతం సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐఎం–అహ్మదాబాద్, బెంగళూరు తదితర క్యాంపస్‌లలో ఈ నెల రెండో వారంలోపు ఈ ప్రక్రియ పూర్తవనుంది. ఇప్పటి వరకు లభించిన సమాచారం ప్రకారం-ఇతర ఐఐఎంలలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ దాదాపు వంద శాతం లభించే సంకేతాలున్నాయని ఆయా క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్, ఫైనాన్స్

- ఐఐఎంలు, ఇతర బి-స్కూల్స్‌లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌లో ఈ ఏడాది కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల హవా కనిపించింది. ఇప్పటి వరకు అన్ని బి-స్కూల్స్‌లో దాదాపు 40 శాతం మేర సమ్మర్ ప్లేస్‌మెంట్స్.. కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాలకు చెందిన సంస్థల నుంచే ఉన్నాయి. బీసీజీ, బెయిన్ అండ్ కో, యాక్సెంచర్ స్ట్రాటజీ, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, సినర్జీ కన్సల్టింగ్ కంపెనీలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి.
- కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల తర్వాత ఐటీ, ఈ–కామర్స్ సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా ఉన్నాయి. ఈ రంగాల్లో డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ చేసే విధంగా ఆఫర్లు లభించాయి. అదే విధంగా గూగుల్, ఫేస్‌బుక్ సంస్థలు కూడా ఎస్‌పీఓ ఆఫర్లు కల్పించాయి.

సేల్స్, అండ్ మార్కెటింగ్‌లోనూ

సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రొఫైల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్స్ జోరు కొనసాగింది. ముఖ్యంగా ప్రొడక్ట్ రీసెర్చ్, మార్కెట్ అనాలిసిస్ విభాగాల్లో విధులు నిర్వర్తించే విధంగా ఈ ఆఫర్స్ లభించాయి. అదే సమయంలో జనరల్ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ఖరారయ్యాయి. పలు సంస్థలు ఈ విభాగాల్లో విద్యార్థులను నియమించుకునే క్రమంలో విశ్లేషణాత్మక దృక్పథం, మార్కెట్ పరిస్థితులపై వారికున్న అవగాహనను క్షుణ్నంగా పరిశీలించి ఆఫర్స్ ఇచ్చినట్లు ఐఐఎంల వర్గాలు పేర్కొన్నాయి.



ఎంబీఏ స్పెషల్

ఈ ప్రొఫైల్స్‌లో అధికంగా

సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో ఎక్కువగా డేటా మేనేజ్‌మెంట్; ఫైనాన్స్ మేనేజ్‌మెంట్; జనరల్ అడ్మినిస్ట్రేషన్; సేల్స్ అండ్ మార్కెటింగ్; డేటా అనలిటిక్స్; బిజినెస్ స్ట్రాటజీస్ ప్రొఫైల్స్ ముందంజలో ఉంటున్నాయి.

ఎందుకంత క్రేజ్

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ పేరిట కంపెనీలు ఐఐఎంల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఆఫర్స్, రూ.లక్షల్లో స్టయిపండ్ ఇవ్వడానికి కారణం ఏంటి? అంటే వినిపిస్తున్న సమాధానం.. ఈ ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు రియల్ టైమ్ నైపుణ్యాలు, అప్‌డేటెడ్ నాలెడ్జ్ ఉంటుందని ఆయా సంస్థలు భావించడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక్కడ బోధన విధానాలు అత్యున్నత స్థాయిలో ఉంటాయి. విద్యార్థులను కార్పొరేట్ లీడర్లుగా తీర్చిదిద్దే విధంగా కరిక్యులం ఉంటుంది. అందుకే ఈ ఇన్‌స్టిట్యూట్స్ నుంచి ఇంటర్న్ ట్రైనీలను నియమించుకునేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంటున్నారు.

పూర్తిస్థాయి కొలువుకు మార్గం

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ ట్రైనింగ్ సమయంలో విద్యార్థులు చూపే పనితీరు ఆయా సంస్థల్లో పూర్తి స్థాయి కొలువుకు మార్గంగా నిలుస్తుంది. ఎస్‌పీఓ దక్కించుకున్న అభ్యర్థులు ట్రైనీగా ప్రతిభ చూపితే.. అదే సంస్థలో శాశ్వత నియామకం సొంతం చేసుకునే అవకాశం కూడా ఉంది. ఇంటర్న్‌షిప్ చేసిన సమయంలో తమకు కేటాయించిన విధులు, విభాగాల్లో తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను ప్రదర్శించిన వారికి కంపెనీలు ముందుగానే ఆఫర్స్ ఖరారు చేస్తున్నాయి. ఇలాంటి అభ్యర్థులకు ద్వితీయ సంవత్సరం చివర్లో నిర్వహించే ఫైనల్ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియల్లో పాల్గొనకుండానే ఫైనల్ ఆఫర్ లభిస్తుంది.

ఫైనల్ ప్లేస్‌మెంట్స్

ప్రస్తుతం సమ్మర్ ప్లేస్‌మెంట్ ట్రెండ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఫైనల్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ కూడా ఆశాజనకంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంస్థల వ్యాపారాలు పుంజుకుంటున్నాయని, అవి తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకు అవసరమైన స్కిల్స్ ఉన్న వారిని నియమించుకునేందుకు ప్లేస్‌మెంట్స్‌కు వస్తున్నాయని చెబుతున్నారు.

ఇతర బి-స్కూల్స్‌లోనూ

ఐఐఎంలతోపాటు దేశంలోని ఇతర ప్రముఖ బి-స్కూల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ ఆశాజనకంగా ఉండనున్నాయి. అలాగే మరో ప్రముఖ బీస్కూల్ ఎక్స్ఎల్ఆర్ఐ–జెంషెడ్‌పూర్‌లోనూ వంద శాతం ఇంటర్న్‌షిప్ ఆఫర్లు లభించాయి. అంతేకాకుండా రెండు నెలల వ్యవధికి ఇచ్చే స్టయిపండ్ కూడా గరిష్ఠంగా రూ.3.5 లక్షలుగా నమోదవడం విశేషం. అదే విధంగా ఢిల్లీ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలోనూ ఎంబీఏ విద్యార్థులకు బెస్ట్ ఆఫర్లు లభిస్తాయని భావిస్తున్నారు.